ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


పార్కులు, చెరువులపై సమీక్షలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు, అధికారులు

కూకట్‌పల్లి: ఖాళీ స్థలాలు, పార్కుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం హెచ్‌ఎండీఏ అధికారులతో పార్కులు, చెరువులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాముని చెరువు, మలేషియన్ టౌన్‌షిప్ వద్ద ఐదు ఎకరాలు, 15వ ఫేజ్ చిత్తారమ్మ ఆలయం దగ్గర ఖాళీ స్థలం, 9వ ఫేజ్‌లోని 2 ఎకరాల ఖాళీ స్థలాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలో తీసుకొని అభివృద్ధి పరచాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించే విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. గతంలో నిర్మించిన పార్కుల అభివృద్ధి నేడు కుంటు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ అధికారులు, కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల సమస్యలు పరిష్కరించాలి

అయా బస్తీ దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. అల్లాపూర్‌లో డీఎంహెచ్‌ఓ డా. ఉమా గౌరీతో సమావేశం నిర్వహించారు. బస్తీ దవాఖానా సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా పర్వత్‌నగర్ బస్తీ దవాఖానాలో నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. మూత్ర శాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూకట్‌పల్లి బస్తీ దవాఖానాను నూతనంగా నిర్మిస్తామని అందుకు తగ్గ ప్రణాళికలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శోభరాజ్, డాక్టర్ హరీష, డాక్టర్ మౌనిక, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మసీదుల వద్ద వసతులు కల్పించాలి

రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు తెలిపారు. మసీదుల వద్ద శానిటేషన్, నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పార్కులు, ఆట స్థలాల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి గాయత్రినగర్, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లోని పార్కులను పరిశీలించారు. గాయత్రినగర్‌లోని ఇండోర్ షటిల్ కోర్టు స్టేడియాన్ని పరిశీలించి ప్రజలు, క్రీడాకారుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ప్రహరీ, వాకింగ్ ట్రాక్, వాచ్‌మెన్ రూం నిర్మించాలని, బోరు వేయించాలని కోరారు. వర్షం వచ్చినప్పుడు స్టేడియం పై కప్పు నుంచి వర్షపు నీరు కురుస్తుందని, ఎండా కాలంలో ఉదయం బయట కూర్చోవడానికి షెడ్డు నిర్మించాలని కోరారు. అదే విధంగా మహిళలు మంచినీరు తక్కువ సమయం సరఫరా అవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మంచి నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సున్నం చెరువు పార్కు వద్ద మొక్కల సంరక్షణ కోసం ఒక నీటి సంపు నిర్మించాలని, పార్కులో టైల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ నగర్‌లోని పార్కు పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు డీఈ శంకర్, ఏఈ రంజిత్, జలమండలి అధికారులు డీజీఎం శివ, మేనేజర్‌లు అన్వేత్, అబ్దేల్ జాకీ, యూబీడీ అధికారులు మేనేజర్ విజయరాణి, హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రవణ్, ఎస్ఆర్‌పీ సురేష్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గాయత్రి నగర్‌లోని స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా


జాబ్‌మేళాలో పాల్గొన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు

మూసాపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూకట్‌పల్లి టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కై టెక్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ శనివారం జాబ్‌మేళా నిర్వహించింది. 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. 42 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా జాబ్ ఆఫర్ చేశారు. వార్షిక వేతనం 5.2 లక్షలుగా కంపెనీ అధికారులు పేర్కొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. అలివేలు మంగమ్మ తెలిపారు. అత్యధిక వార్షిక వేతనం ఆఫర్ చేయటం కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డా. శ్రీనివాసరావు, కన్వీనర్ నాగార్జున, జి. గణేష్, అశ్విని కుమార్ పాల్గొన్నారు.

రామకృష్ణ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



మూసాపేట: కూకట్‌పల్లి బాగ్ అమీర్‌లోని రామకృష్ణ హైస్కూల్‌లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కూకట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఆలోచింపజేసే ఆకృతులను తయారు చేశారని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి. రామ కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారంలో బండి రమేష్, ఆలయ కమిటీ

మోతీనగర్: మూసాపేట డివిజన్, పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధు, ఆలయ ఈఓ గుమ్మడిదల సుధాకర్ పర్యవేక్షణలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా బాకారం బుచ్చయ్య, కమిటీ సభ్యులుగా రామకృష్ణారావు, నర్సింహులు, అనూపమ, దూడల జనార్దన్, మల్లికార్జునరెడ్డి, నరసింహారావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, అధ్యక్షులు వేణు, మాజీ బి బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఏఎంసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి, తూము సంతోష్, డివిజన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు కేటాయించాలని నిరసన..

మోతీనగర్: శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని పాండురంగ నగర్ వాసులకు కేటాయించాలని పీఆర్ నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పి. వంశీ కృష్ణశర్మ మాట్లాడుతూ.. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం పాండురంగనగర్ వాసులు ఆలయాన్ని నిర్మించారని, గతంలో పలుమార్లు స్థానికులకు కేటాయించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఆలయ కమిటీలో రాజకీయ జోక్యం మితిమీరిందన్నారు. ఇప్పటికైనా ధర్మాదాయ శాఖ అధికారుల స్పందించాలన్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు కూడా ఆహ్వానం లేకుండా కమిటీని ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్, సెక్రటరీ ప్రమీల, కోశాధికారి, బి. లలిత్ మోహన్, సభ్యులు వి. గోపాల్, బి.సరేష్, తదితరులు పాల్గొన్నారు.

5కే రన్ లోగో ఆవిష్కరించిన మంత్రి సీతక్క



ఆల్విన్‌కాలనీ: అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 16న 5కే రన్ నిర్వహించనున్నారు. శనివారం ఆ లోగోను మంత్రి ధనసరి సీతక్క, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ శేరిలింగంపల్లి పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, సీనియర్ నాయకులు కూన సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మధు, ఎల్లాజీ, యశ్వంత్, పద్మ, గాయత్రి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం



బాలానగర్: బాలానగర్ డివిజన్, చరబండ రాజు నగర్‌లో కొలువుదీరిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపనకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆహ్వానించారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కలిసి పత్రిక అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, యుగంధర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు విజయకుమార్, పాలమూరు రాజు, జీఆర్. రమేష్, ఆకుల నరేందర్, గుట్ట తులసి, కళాకుంట్ల స్వాతి, సుజాత, సోని తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించిన కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాల సైన్స్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు. – మూసాపేట

సాయిబాబా ఆలయంలో వైద్య సేవలు ప్రారంభం


మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: మానవ సేవే మాధవ సేవ అన్న నానుడిని నిజం చేస్తూ సాయికృష్ణ కాలనీలోని సాయిబాబా ఆలయ నిర్వాహకులు ఆలయంలో పాలి క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. సత్య ఆదిత్య గురువు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ క్లినిక్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. దేవాలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి పరుస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పాలిక్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్త పరీక్షలు, ఎక్స్‌రే, జనరల్ ఫిజీషియన్ డాక్టర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయిబాబా ట్రస్ట్ సభ్యులు వెంకట్, మల్లికార్జున్, నటరాజు, వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు రాజుయాదవ్, చందుయాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

31 వరకు రుసుము చెల్లిస్తేనే రాయితీ వర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు స్వయంగా ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఈనెల 31వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుందన్న సమాచారాన్ని వారికి తెలపాల్సిన అవసరం ఉందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను పరిశీలించి క్రమబద్ధీకరణకు అర్హత సాధించిన వాటిని పరిశీలించి, వారికి సంబంధిత అధికారులు ఈనెల 30లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించినట్లయితే ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు.

నీటి ఎద్దడిపై..

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జిల్లాలో ఉన్న బోర్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అవసరమైన చోట వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేసి, ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, 13 పురపాలక సంఘాలకు చెందిన కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతుల కోసం బరి గీసి కొట్లాడతా

ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: ఎద్దు ఏడిస్తే ఎవుసం.. రైతు ఏడిస్తే రాజ్యం బాగుపడదని, రైతుల జోలికి వస్తే ఊరుకునేది లేదని, ఎంతటి వారితోనైనా బరి గీసి కొట్లాడతానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్‌లోని వార్డు కార్యాలయం ఎదురుగా రైతులు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దుండిగల్‌లో గతంలో 490 ఎకరాలను రైతులకు అప్పటి ప్రభుత్వం అసైన్ చేసిందన్నారు. 50 ఏళ్ల తరువాత ప్రస్తుతం సదరు స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి లాక్కోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో పట్టా భూములు కోల్పోయిన రైతులతో పాటు అసైన్డ్ స్థలాలకు సైతం నష్టపరిహారం చెల్లించాలని మొట్ట మొదట కొట్లాడింది తానేనన్నారు. 12 సంవత్సరాల పాటు అసైన్డ్ స్థలంలో ఉంటే సదరు భూమి రైతుకే దక్కుతుందని రెవెన్యూ చట్టంలోనే ఉందన్నారు. భూమి రైతుకు భరోసా అని, నోటికాడి బుక్క లాక్కోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రులకు లేఖలు రాస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విఘ్నేశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, నాయకులు బండారి మహేష్, విజయలక్ష్మి, ఆకుల మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, భాను గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినికి అవార్డు అందజేత


నగదు అందజేస్తున్న విద్యా వెంకట్, ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ

మూసాపేట: ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు(ఉగోరా) జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన పొలిటికల్ సైన్స్ విద్యార్థిని దివ్యకు అవార్డు, నగదు పారితోషికం అందజేశారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మతో కలిసి వేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్ అందజేశారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ ఇన్‌చార్జి నాగుల వేణు, ప్రజా ఆలోచన వేదిక ప్రతినిధి పందిరి శేఖర్, అధ్యాపకులు మాధవి, జ్యోత్స్న, జి. సంధ్యారాణి, కె. అరుణ, కె. సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మసీదుల వద్ద వసతులు కల్పిస్తాం

బాలానగర్: రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద వసతులు కల్పించడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో ఆయనను ముస్లిం మత పెద్దలు కలిసి సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.